క్లుప్తంగా

ఎస్సైకి అభినందనల వెల్లువ



దామెర: ఇటీవల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కొంక అశోక్‌కు సోమవారం అభినందనలు వెల్లువెత్తాయి. మండలంలోని ఊరుగొండ సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, ఉపసర్పంచ్ జన్ను విద్యాసాగర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కూనాటి సునీల్‌రెడ్డి, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ పున్నం సంపత్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని అన్నారు. అనంతరం ఆయన పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరిక



ఐనవోలు: సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, పున్నేలు సర్పంచ్ కత్తి దేవేందర్ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాగరాజుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

యువజనోత్సవాలకు తరలిరావాలి

శాయంపేట : యువతలో దాగివున్న కళానైపుణ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యువజన సర్వీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన హనుమకొండలోని జవహర్‌లాల్ స్టేడియంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి యువజనోత్సవాకు మండలంలోని యువతి, యువకులు తరలిరావాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి సోమవారం ప్రకటనలో కోరారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉత్సవాలు జరుగుతాయని, 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సుగల వారు పాల్గొనవచ్చని తెలిపారు. జానపద నృత్యం, జానపద గేయం, కథా రచన, పోస్టర్ తయారీ, డిక్లమేషన్, ఫోటోగ్రఫీ పోటీలో పాల్గొనవచ్చని వెల్లడించారు. గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసి ప్రశంసా పత్రాలు అందిస్తారని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 20వ తేదిలోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9989603085,8686731728, 8639299354, 9704839204, 9701765567లకు సంప్రదించగలరని సూచించారు.

రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా సంపత్‌రావు



ఖిలా వరంగల్: వరంగల్ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా ఫోర్ట్ రోడ్డు ఏకశిలనగర్‌కు చెందిన సంఘం రాష్ట్ర కార్యదర్శి బోయినపల్లి సంపత్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు వరంగల్‌లో మాజీ అధ్యక్షుడు గజ్జి గోవర్ధన్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో 87మంది రేషన్ డీలర్లు సంపత్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు చెక్కుల పంపిణీ

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గంలోని హసన్‌పర్తి, హనుమకొండ, ఐనవోలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ చల్లా ప్రసాద్ తెలిపారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో ఉదయం ప్రారంభం కానున్న కార్యక్రమానికి లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

ధనుర్మాసోత్సవ పూజలు

కాజీపేట: ధనుర్మాసోత్సవాన్ని పురస్కరించుకొని చైతన్యపురి కాలనీ పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మహిళలు సోమవారం మంగళ హారతులతో పూజలు చేశారు. ఆలయ ప్రధాన పూజారి రఘురామాచార్యుల ఆధ్వర్యంలో అలివేలు మంగ సమేతుడైన స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్ గౌడ్, మేజర్ వడ్డెపల్లి నరేందర్‌తో పాటు పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

యోగా.. దినచర్యలో భాగం కావాలి

హన్మకొండ అర్బన్: ప్రతిఒక్కరూ యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని నేషనల్ యోగా మాస్టర్, ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటరాజయ్య అన్నారు. నగరంలోని వడ్డెపల్లి ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమానికి ఆయన మాట్లాడుతూ ప్రజలు వివిధ అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని నివారించేందుకు ఒకే మార్గం యోగా, ధాన్యం అని వివరించారు.

విద్యార్థులపై స్వచ్ఛంద సంస్థల ప్రత్యేక దృష్టి



కమలాపూర్: ఎంఈఓతో కలిసి విజేతలకు బహుమతులు అందజేస్తున్న జగదీశ్వర్



శాయంపేట : ట్రైనర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కమలాపూర్: విద్యార్థుల క్రమశిక్షణ, విద్యపై స్వచ్ఛంద సంస్థలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. చదువులో రాణిస్తున్న విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు బహుమతులు అందిస్తూ పలువురి దృష్టిని విద్యపై మళ్లిస్తున్నాయి.

గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

ఈనెల 22న జరిగే జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న ఎస్.శైలజ అత్యంత ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలువగా ఆమెకు రూ.500 నగదుతో పాటు శంకర్‌నారాయణ డిక్షనరీ, జ్ఞాపిక అందించారు. అలాగే ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన ఎ.కార్తీక్ ద్వితీయ స్థానంలో నిలువగా అతనికి రూ.200 నగదుతో పాటు శంకర్‌నారాయణ డిక్షనరీ, జ్ఞాపిక, ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఎస్.శ్రీచరణ, ఎం.వెన్నెల, బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎ.ఐశ్వర్యలకు కన్సోలేషన్ బహుమతుల కింద శంకర్‌నారాయణ డిక్షనరీతో పాటు జ్ఞాపికలను ఎంఈఓ రాంకిషన్‌రాజు, ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ మ్యాథ్స్ టీచర్) అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను పొందినప్పుడే భవిష్యత్తులో ఉన్నతంగా ఎదుగుతారని విశ్వాని ఫౌండేషన్ ట్రైనర్ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలలో ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు ప్రతిభ, పాఠాలపై నిర్వహించే కౌన్సిలింగ్ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు, గురువులు చూపిన దారిలో విద్యార్థులు నడవాలన్నారు. ఉపాధ్యాయులు బోధించిన తరగతులను శ్రద్ధగా విని పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు. విజయం సాధించడానికి ఏడు సూత్రాలను అపజయం పొందడానికి ఐదు సూత్రాలను బోధించారు. శ్రీమత్స్యగిరిస్వామి ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు ఫౌండేషన్‌కు విరాళాన్ని అందించారు. అనంతరం ట్రైనర్ ఆంజనేయులును పాఠశాల యాజమాన్యం శాలువాతో సత్కరించారు.

రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకున్నారు

● ఎమ్మెల్యే కడియం శ్రీహరి



చెక్కులు పంపిణీ చేస్తున్న కడియం

ధర్మసాగర్ : అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు ఏ రకంగా వచ్చినా ఈసారి రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకున్నారని, ప్రజల తీర్పును గౌరవించాల్సిన అవసరం ఉందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ గ్రామాలకు చెందిన 84 మంది లబ్ధిదారులకు సోమవారం ఆయన చెక్కులను అందించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాలు, అమరుల త్యాగాల ఫలితంగా కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందని అన్నారు. రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలు కావస్తుందని, ఈపది సంవత్సరాల కాలంలో కేసీఆర్ నాయకత్వంలో దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని లక్షల కుటుంబాలకు, వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, ఎంపీపీ నిమ్మ కవిత, జెడ్పీటీసీ పిట్టల శ్రీలత, స్థానిక సర్పంచ్ ఎర్రబెల్లి శరత్, ఆర్‌ఐలు కిరణ్, శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ.. రూ.3091 రికవరీ



సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న శ్రీనివాస్

ఐనవోలు: మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి నెల వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై అధికారులు తనిఖీ నిర్వహించారు. మొత్తం రూ.1.55 కోట్ల పనులు జరుగగా ఈనెల 7 నుంచి 17 వ తేదీ వరకు గ్రామాల్లో అధికారులు తనిఖీ చేపట్టి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిసైడింగ్ ఆఫీసర్, అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కూలీలకు పనులు కల్పించి, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. రోజుకూలీ రూ.272 గిట్టేలా ప్లాన్ చేయాలని సూచించారు. మండలంలో రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. పంచాయతీ కార్యదర్శులకు రూ.1694, టెక్నికల్ అసిస్టెంట్ నీరజకు రూ.994, ఫీల్డ్ అసిస్టెంట్ పుల్లయ్యకు రూ.403 జరిమానా విధించారు. మొత్తం రూ.3091 రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా వేదికలో మార్నేని మధుమతి, ఎంపీడీఓ వెంకటరమణ, విజిలెన్స్ అధికారులు నర్సింహారెడ్డి, సాగరిక, అంబుడ్స్ మెన్ నాగరాజు, క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీనివాస్, ఎంపీఓ రఘుపతిరెడ్డి, ఏపీఓ నక్క కుమారస్వామి, ఆడిట్ టీమ్ మేనేజర్ వేణు, ఈసీ, టీఏలు, సర్పంచ్‌లు, ఎస్ఆర్‌పీలు, డీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

● మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

దామెర: బీఆర్ఎస్ కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని ప్రతిఒక్కరికీ అండగా ఉంటానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండల కేంద్రం సమీపంలోని ఏఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో తనకోసం పనిచేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల, పార్లమెంట్ ఎన్నికల కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి నియోజకవర్గంలో పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివద్ధి కోసం నిరంతరం పనిచేశానని అన్నారు. ఇకపై నిత్యం నియోజవర్గ ప్రజల సమస్యలపై పోరాటం చేసి, సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ మండలాల అధ్యక్షుడు గండు రాము, చంద్రమౌళి, మడికొండ శ్రీను, రాజ్‌కుమార్, సంజీవరెడ్డి, సారంగపాణి, ఎంపీపీలు శంకర్, కళావతి, జెడ్పీటీసీ గరిగె కల్పనకృష్ణమూర్తి, పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితరామకృష్ణ, వరంగల్ మాజీ ఏఎంసీ చైర్మన్ చింతం సదానందం, దామెర, పరకాల, నడికూడ, ఆత్మకూరు, గీసుకొండ, సంగెం మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ



హన్మకొండ అర్బన్: ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగులకు జ్యోతిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీల్ చైర్లు పంపిణీ చేశారు. నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 9మంది దివ్యాంగులకు ఫౌండేషన్ సభ్యులు వీల్ చైర్లు, ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు పీ.మల్లారెడ్డి, విజయపాల్‌రెడ్డి, అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు నవీన్‌రెడ్డి, కవితారెడ్డి, హెల్త్ అండ్ వెల్‌నెస్ అడ్వైజర్ డీ.జ్యోతిరెడ్డి, సభ్యులు సంగీతరెడ్డి, వాణిరెడ్డి, మయూరి, అనిల్, నరసింహ, సంతోష్, మనోహర్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన సుబ్రహ్మణ్యషష్టి జాతర



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



బోనంతో బయలుదేరిన పూజారి, భక్తులు

పరకాల: పట్టణంలోనిని శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయంలో శ్రీసుబ్రహ్మణ్యషష్టి జాతర ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు కోమాళ్ళపల్లి నాగభూషణశర్మ ఇంటి నుంచి బోనంను తీసుకుని బయలుదేరడంతో జాతర ప్రారంభమైంది. కోమల్లపల్లి సంపత్ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితరామకృష్ణ, వైస్ చైర్మన్ రేగురి విజయ్‌పాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నిప్పని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, బీజేపీ నాయకులు డాక్టర్ కాళీప్రసాద్, దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, కొలుగూరి రాజేశ్వర్‌రావు, ఈవో వెంకటయ్య, కౌన్సిలర్లు, భక్తులు పాల్గొన్నారు.

మెడికోలను బలిగొన్న అతివేగం!



రోదిస్తున్న డేవిడ్‌రాజ్ కుటుంబ సభ్యులు



డేవిడ్ రాజ్ (ఫైల్)

కైలాస్‌నగర్: అతివేగం.. అజాగ్రత్త రెండు నిండు ప్రాణాలను బలిగొంది. వైద్య విద్యను అభ్యసించి రోగులకు సేవలందించాల్సిన వారు ఊహించని రీతిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యు ఒడిని చేరారు. కుటుంబీకులకు తీరని శోకాన్ని మిగిల్చారు. ఆదివారం అర్ధరాత్రి మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా పాండర్‌కొడ టోల్‌ప్లాజా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రిమ్స్ వైద్య విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. మరో అరగంటలో ఆదిలాబాద్‌కు చేరుకుంటారనే సమయంలో చోటు చేసుకున్న ప్రమాదంలో అనంత లోకాలకు చేరారు. సెలవు రోజు కావడంతో సాయంత్రం వరకు స్నేహితులో సరదాగా గడిపిన ఏడుగురు వైద్య విద్యార్థులు బాలసాయి (23), డేవిడ్ రాజ్ (21), యశ్వంత్, అమృత్‌రాజ్, శరణ్‌దీప్, సాయి కిరణ్, చౌహాన్ కృష్ణ జిల్లాకు సరిహద్దున ఉన్న పాండర్‌కొడ దాబాకు భోజనం చేసేందుకు మూడు బైక్‌లపై వెళ్లారు. భోజనం అనంతరం తిరుగు పయనమైన వారు పాండర్‌కొడ టోల్ ప్లాజా సమీపంలో ఆగి ఉన్న లారీని అతివేగంతో ఢీకొట్టారు. తీవ్ర గాయాలపాలైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని అవనిగడ్డకు చెందిన బాలసాయి, హన్మకొండ జిల్లా పరకాలకు చెందిన డేవిడ్ రాజ్ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. వారు నడుపుతున్న బైక్ నుజ్జునుజ్జవడం ప్రమాద తీవ్రతకు అద్దం పడుతుంది. మిగతా ఐదుగురు క్షేమంగా రిమ్స్‌కు చేరుకున్నారు. వీరంతా ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న మహారాష్ట్ర పోలీసులు మృతదేహాలను పాండర్‌కొడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతివేగంగా అజాగ్రత్తతోనే బైక్ నడపడంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లుగా అక్కడి పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

ఉపాధిహామీ పనులు వినియోగించుకోవాలి



కూలీల వివరాలు సేకరిస్తున్న అధికారులు

దామెర: జాతీయ ఉపాధిహామీ పనులను కూలీలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ కాసర్ల రవీందర్ అన్నారు. మండలంలోని ఊరుగొండ, దమ్మన్నపేట గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను, నర్సరీలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీల వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జాబ్‌కార్డు కలిగివున్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలని అన్నారు. ఈజీఎస్ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని, కూలీల వివరాలు సక్రమంగా చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ శారద, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ కూలీలు తదితరులు ఉన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఎల్కతుర్తి: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని కబడ్డీ అసోషియేషన్ జోన్ గౌరవ చైర్మన్ మాచర్ల కుమారస్వామి, అధ్యక్షుడు సంపత్‌రావు అన్నారు. భీమదేవరపల్లి మండలం కొత్తకొండ హైస్కూల్ గ్రౌండ్‌లో జోన్ లెవల్ సీనియర్ పురుషుల కబడ్డీ సెలక్షన్ పోటీలు సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో 40మంది క్రీడాకారులు హాజరయ్యారు. సెలక్షన్ అయిన క్రీడాకారులు ఈనెల 24న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జిల్లా కబడ్డీ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటర్ జోనల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎమ్ ఆజ్మీరా సర్దార్, కృష్ణమూర్తి, మల్లేశం, రాణి, శ్రీనివాస్, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, ఉమా తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వీసీ, తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫిజిక్స్ విభాగం, ఇండియన్ అసోసియేషన్ ఫర్ రేడియేషన్ ప్రొటెక్షన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 23న బెనిఫిషియల్ ఎఫెక్ట్ ఆఫ్ రేడియేషన్ టెక్నాలజీ అండ్ ఇండియన్ న్యూక్లియర్ ఎనర్జీ ప్రోగ్రాం అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈమేరకు సంబంధిత కరపత్రాలను కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావుతో కలిసి నిర్వాహకులు సోమవారం ఆవిష్కరించారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఈనెల 20వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ మంజుల తెలిపారు. ఫిజిక్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ సీజే శ్రీలత, బీఓఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ మంజుల, డాక్టర్ ఈవీ.రావు, డాక్టర్ నర్సింహులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

కమలాపూర్: పాఠశాల, కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు గంజాయి, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై సీమా ఫర్హీన్ సూచించారు. ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూళనకు సంబంధించి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో యువత తాత్కాలిక ఆనందం కోసం మద్యం, మత్తు పదార్థాలకు బానిసలై అనేక నేరాలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ జీవితాలను, భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు సేవించడం ద్వారా కలిగే అనర్థాలు, దుష్ప్రభావాలను, వాటిని విక్రయించే, సేవించే వారిపై తీసుకునే చట్టపరమైన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తానా శాంతిసద్భావన యాత్ర



పద్యాలను కంఠస్థం చేయిస్తున్న ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న హెచ్ఎం రాజన్న

వేలేరు : విద్యార్థులకు వినయ, విధేయత,పెద్దల పట్ల గౌరవం పెంచడానికే శాంతి సద్భావన యాత్ర నిర్వహిస్తున్నట్లు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గౌరిశెట్టి రాజన్న అన్నారు. అమ్మ, నాన్న, గురువు శతకాలలోని పద్యాలను కంఠస్థం చేయిస్తూ విద్యాబుద్ధులు నేర్పినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) వివిధ దేశాల్లో ఉన్న తెలుగు సంఘాల సమన్వయంతో వందేవిశ్వ మాతరం పేరుతో చిగురుమళ్ల శ్రీనివాస్ 100 దేశాల్లో శాంతి సద్భావన యాత్ర నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా 10లక్షల మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషోపాధ్యాయులు పోతుల ఉమాదేవి, బిచ్చాల సౌందర్య, బొల్లం కుమారస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు రాధిక, తబిత, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీ సహజం



హెచ్ఎం శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కమలాపూర్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజమని ఎంఈఓ రాంకిషన్‌రాజు అన్నారు. మండలంలోని గూడూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పని చేసి బదిలీపై వెళ్లిన తాడూరి శ్రీనివాస్‌ను సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను శాలువాలతో సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రాంకిషన్‌రాజు మాట్లాడుతూ.. 2011లో బదిలీపై ఇక్కడకు వచ్చిన శ్రీనివాస్ 12 ఏళ్లుగా ఎనలేని సేవలందించారని, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 150కి పైగా పెంచారని అన్నారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంకతి సాంబయ్య, ఎంపీటీసీ పాక లక్ష్మీరవీందర్, మండల నోడల్ అధికారి శ్రీధర్, పాఠశాల హెచ్ఎం పోచయ్య, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం రాజమల్లయ్య, కేజీబీవీ ఎస్ఓ అర్చన, ఉపాధ్యాయులు సంజీవరెడ్డి, పవన్‌కుమార్, శివప్రసాద్, సువర్ణ, కాంతయ్య, మమత, రాజిరెడ్డి, శ్రీదేవి, సునీత, విజయసాయి, సీఆర్పీ సుభాష్, గ్రామస్తుడు నరిగె ఓదెలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లెక్చరర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం



ఖిలా వరంగల్: తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం (475) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు రేమిడి మల్లారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు వరంగల్ శంభునిపేట (రంగశాయిపేట) ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభాదేవి ఆధ్వర్యంలో మల్లారెడ్డికి అధ్యాపకులు సోమవారం పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరేష్, ఎల్లస్వామి, వీరాంజన్, సుధాకర్, అనిల్, మహాలక్ష్మి, లక్ష్మి, రూపారాణి, మమత, అనిత, హాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.